## టానా-
## ఆంధ్ర సచిత్రవార పత్రికల సంయుక్త సాహితీ సంబరం పోటీలో బహుమతి పొందిన మినీ కథలు!

హాస్పిటల్లో పిల్లల వార్డువైపు గాభరాపడుతూ నడుస్తున్నాడు శేఖర్. అతని మనసంతా భయం భయంగా ఆరాటంగా వుంది. 'బేబీకి బాగాలేదన్న' వార్త అతనికి చాలా ఆలశ్యంగా అందింది. ఏమై వుంటుంది ? రాత్రి తను పార్టీ అయ్యాక అర్ధరాత్రి ఇంటికి వెళ్లేసరికి గాఢనిద్రలో వుంది. ఉదయం కాన్వెంట్‌కు వెళ్లేసరికి తను హాంగోవర్‌లోనే వున్నాడు. అసలేం జరిగిందో అర్ధం కావటంలేదు. అయోమయావస్థలో ఖంగారు, ఖంగారుగా అడుగులేస్తున్నాడు. అందరి తండ్రుల్లాగే శేఖర్‌కి తన ముద్దుల కూతురంటే ఎంతో ప్రేమ. ప్రాణం.. ఆ పిల్లకేమన్నా జరిగితే తట్టుకోగలడా అన్నట్లుంది అతని తీరు.

అంగలారుస్తూ వచ్చిన శేఖర్‌ని చూసి, పలకరింపుగా సన్నగా నవ్వాడు రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ ప్రసాద్. వాళ్లిద్దరూ బార్ బ్రదర్స్. దడదడలాడుతున్న గుండెలతో కూతురు పడివున్న బెడ్ దగ్గరకు పరిగెత్తాడు శేఖర్.

ఎప్పుడూ బంతిలా త్రుళ్లిపడుతూ ముద్దులు మూటకట్టే బేబీ వడిలిపోయి, డీలాగా స్పృహ తప్పినట్లు పడివుంది. సెలైన్ ఎక్కిస్తున్నారు.

ప్రక్కనే స్టూలుమీద దిగులుపడుతూ కూర్చుని వుంది శేఖర్ భార్య. భర్తని చూడగానే 'అమ్మయ్య వచ్చేశారు' అన్న భావంతో పాటు ఆవిడ కళ్లనిండా నీరు తొణికిసలాడింది. మరి పక్కన భర్త తోడు లేకుండా, అకస్మాత్తుగా అనారోగ్యం పాలైన పసిపిల్లతో ఇంతసేపూ ఆ ఇల్లాలు పడిన వేదన - అనుభవించిన బాధ వర్ణనాతీతం. కబురు పట్టుకెళ్లిన మనిషి అతనికోసం ఊరూ వాడా వెతికి, వెతికి విషయం తెలిసి తండ్రి వచ్చేసరికి ఈవేళైంది.

కూతురి బెడ్ దగ్గర మోకాళ్లమీద కూర్చుని "అమ్మా... బేబీ...!" నీరు నిండిన కళ్లతో ఆర్ద్రంగా పిలిచాడు శేఖర్. పైకి కనపడరు కానీ, అమ్మడంటే ఎంతో ప్రేమ. అసలెంత మెత్తని మనసో... ఎందుకిల్లా తయారయ్యారో... ఇల్లాలు అమాయకంగా భర్త వంక చూస్తూ ఆలోచిస్తోంది.

"బేబీ.... ఇలా చూడమ్మా.... నాన్నని..." తల నిమురుతూ లాలనగా మృదువుగా కంపిత స్వరంతో పిలుస్తున్నాడు శేఖర్. కూతురి స్థితి అతనికి దుఃఖాన్ని కృంగదీస్తోంది. స్వభావసిద్ధమైన గంభీరత, కరుకుతనంతో పాటు వేదనతో కదిలిపోతున్నాడు.

తండ్రి స్పర్శకు పాప మెల్లిగా కళ్లు తెరిచింది. తెల్లని పువ్వుల్లా విశాలంగా, అమాయకంగా నవ్వుతుండే కళ్లు.... బరువుగా, ఎర్రగా ఉబ్బి ఉన్నాయి. నీరసంగా వాలి, లోపలికి తేలి తేలిపోతున్నాయి. నిగ్రహించుకోలేని బాధతో తండ్రి కళ్లు చెమరించాయి.



"అమ్మలూ... అమ్మా... డాలీ... బాబీ... నేనమ్మా.... నాన్నను.." అంటున్నాడు చలిత స్వరంతో గద్గదికంగా.

"ఏం..తి.. నానాలూ..!? మీలు... మల్లా మందుకొత్తాలా... ఏలుత్తున్నాలు...!" నంగి నంగిగా అంది బేబి కళ్లు తెరిచి. మధురిమ లొలికే ముద్దు ముద్దు మాటలు మొద్దుబారి తూలుతున్నాయి. వాలిపోతున్న చూపులతో తండ్రి వంక ఎర్రగా చూసి.. "ఛీ... మల్లా మందు కొత్తాలన్నమాత మీలు..." కోపంగా అంది మాటలు కూడదీసుకుంటూ.

ఉద్యోగరీత్యా సిటీలో వేరు కాపురం. అదుపు ఆజ్ఞలేని మొండితనం... దురలవాట్లు.... వారించలేని ఇల్లాలు.... ఆరేళ్ల పాపకు అన్నీ తెలిసిపోతున్నాయి ఇప్పుడిప్పుడే. ఇరుగు పొరుగు తాగి వచ్చి గోలచేసే తండ్రిని గురించి అనుకొనే ఎగతాళి మాటలు... విమర్శలు... మందు కొడితే భావావేశం ఎక్కువై వీధినపడి చిందులు తొక్కటం, ఏడవటం, అదేమంటే తల్లిని చితకబాదటం... అసం



శ్రీమతి యర్రమిల్లి విజయలక్ష్మి 'మందు' మినీ కథా రచయిత్రి. పెరిగింది తణుకులో. ఎం. ఏ. (లిటరేచర్) పట్టా పుచ్చుకుని ప్రస్తుతం పేరాలలో ఆంధ్రాబ్యాంకులో ఆఫీసరుగా పని చేస్తున్నారు. తన గురించి పరిచయం చేసుకుంటూ -

"సాహిత్యంలో చెప్పుకోదగ్గ కృషి 84 నుండి. అత్యుత్తమ కథగా 'బొరుసు', ఉత్తమ రేడియో నాటికగా 'నూరేళ్లపంట', ఉత్తమ మినీ కథగా 'బాడుగ', ఉత్తమ రేడియో కథగా 'వైకల్యం' మంచి సాహితీ సంస్థల మన్నన అందుకున్నాయి. ఆకాశవాణి, వివిధ పత్రికల ద్వారా కథలు, కొన్ని డైరెక్టు నవలలు వెలుగు చూసాయి. ఇంకా మంచి కథలు రాయాలని నా ఆశయం, టానా - ఆంధ్ర సచిత్రవారపత్రికలకు నా కృతజ్ఞతాంజలులు" అంటున్నారు.

తోషకరమైన ఇలాంటి సంఘటనలు ఆ పసిపాపకు నిత్యం ఎదురౌతున్నాయి.

కూతురు స్థితి గమనిస్తున్న శేఖర్ కనుబొమ ముడిపడింది.



“అసలేమైంది ప్రసాద్... బేబీకి...?” డాక్టర్ని అడిగాడు భయంగా... అనుమానంగా.

“ఏమైందా... మెల్లిగా అడుగుతున్నావా.. !” అన్నట్లు భర్త వంక కోపంగా... నిష్ఠూరంగా... నిస్సహాయంగా చూస్తోంది అతని భార్య.

పల్స్ చూస్తూ “త్రాగింది క్వార్టర్ బాటిలే అయినా... పసిపిల్ల కదా కాస్త హడావిడి చేసింది. దుకాణం నేరుగా ఇంట్లో తెరిస్తే కాస్త జాగ్రత్తగా ఉండాలి బ్రదర్...! డోంట్ వర్రీ... షి విల్ బి ఆల్‌రైట్... ఆ... ఇంతకీ రాత్రికి మన పార్టీ ఎక్కడ...?” అన్నాడు.

అతనూ మందు గురుడే...

ఈ మాటలు వింటున్న నర్సు పిల్ల కిసుక్కుమంది. శేఖరం భార్య ముఖం ఎర్రగా చేసుకుని తల తిప్పుకుంది.

“షటప్...! ఇంకెప్పుడూ పార్టీ మాటెత్తకు...” ఫ్రెండ్‌ని కోపంగా కసిరాడు శేఖర్. “నా పాపని నాకు దక్కించావు థాంక్స్” అని మొహం తిప్పుకున్నాడు. ●

# కథ

## దంతుర్తి చిన రామచంద్రరావు

ఓ మంచి కథ వ్రాద్దామని ఎప్పట్నించో కుతూహలం.

కాగితాలు ముందేసుకుని, కలం తీస్తే ఇహ అంత చప్పుని లేవలేను. అది నాలో ఓ బలహీనత.

ఆ వేళ రాత్రి మేడమీద గదిలో కూర్చుని కథ వ్రాస్తున్నాను. కుదరడం లేదు. మనసులో ఉన్నది కాగితంమీదికి కమ్మగా దిగాలంటే కలం బలమే చాలదు. కాలం కూడా కలిసి రావాలి మరి!

ఇంతలోనే - “ఏవండీ - పదకొండు దాటింది - లేవండీ” అంటూ నస ప్రారంభించింది మా మేడమ్.

విసుగ్గా ఆమెకేసి చూసాను. ఆమెగారు కొరకొరా చూస్తోంది.

“ఏమిటీ - అలా చూస్తారూ? కలం అక్కడ పారేసి లేవక!” అని ఆమెగారనలేదుగాని ఉద్దేశం అదే. నో డౌట్!

ఆడవాళ్ల మనసుకుసుమకోమలం అన్నారు. పైగా కొత్త కాపురం. ‘శ్రీదేవి’ అంత అందగత్తె కాకపోయినా ‘భానుప్రియ’లా మెత్తని మనిషి. ఇహ ఆ ధ్యాసలో పడితే ఈ కథ నిద్రపోడం ఖాయం. నిద్రలోంచే అలా కంచికి టికెట్ తీసుకున్నా తీసుకోవచ్చు!

మళ్లీ ఏవో నాలుగు లైన్లు వ్రాసాను.

“మీ అవస్థ చూస్తూనే ఉన్నాను. అంత చేతకానివాళ్ళు అసలు వ్రాయడమెందుకో” అన్నట్టు మేడమీద మేడమ్, నా దగ్గరగావచ్చి - “ఏవండీ - పోనీ నేను వ్రాసిపెట్టనా?” అంది.

“నీ మొహం - నీవల్ల ఏమౌతుంది? పోయి పడుకో” అన్నాను.

తెల్లవారింది. షరా మామూలేగా. ‘గుడ్‌మార్నింగ్’ అన్నట్టు నుంచుంది ఎదురింటి డాబామీద డార్లింగ్. చిరునవ్వు నవ్వాను. రిసీవ్ చేసుకుంది.

మేడమీది మేడమ్‌కి తెలియకుండా, డాబామీది డార్లింగ్‌ని కలుసుకుని, కథ వ్రాసిపెట్టమని కోరాను. ఆమెగారు రచయిత్రి మరి! నాలుగైదు కథలు ఆమెవి పత్రికల్లో పడ్డాయి కూడ. పడిన ప్రతి కథా పట్టుకొచ్చి ‘చూడండీ’ అంటూ నాకు చూపించేది. నేను చూస్తుంటే “మనదంతా సీయింగ్ బ్యూటీయే గదా!” అనేది. నేనే మనగలను? నా రిక్వెస్ట్‌ని డార్లింగ్ మొదట్లో ఓ.కె. చెయ్యలేదు. కనుక ప్రాధేయపడ్డాను. అయినా ‘ఉ’ అనక ‘అ’ అనక, కాస్సేపు ఏడిపించి ఆనక ‘ఎస్’ అంది.

నెల తిరిగిందో లేదో - నేనో రోజున ఆఫీసుకి వెడుతుంటే డాబామీది డార్లింగ్ కేకేసి చెప్పింది “కథ పడిందండీ పత్రికలో” అని. తల తిరిగినంత సంతోషమయింది. ఆఫీసుకెళ్లే తొందరలో పత్రిక చూడ్డం కుదరలేదు. దార్లోనే గుళ్ళో కొబ్బరికాయ కొట్టేసాను. ఆఫీసంతా చెప్పేసాను నా కథ పడిన సంగతి.

రాత్రి డార్లింగ్ ఇంట్లో పత్రిక చూసాను. అద్భుతంగా పడింది కథ.

“కథ” మినీ కథా రచయిత శ్రీ డి. సి. హెచ్. రామచంద్రరావు తూర్పు గోదావరి జిల్లా సామర్లకోటలో 1929 లో జన్మించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి బి.ఎ. బి.కాం., ఎం.ఎ. పట్టా పొందారు. ప్రభుత్వ సర్వీసులో గెజిటెడ్ ఆఫీసరుగా 1987 లో పదవీ విరమణ చేశారు. విద్యార్థి దశనుంచీ సాహిత్యంలో అభిలాష, అనుభవం ఉన్నాయి. నవలలు, కథలు, వ్యాసాలు, కవితలు చాలా వ్రాశారు. రాష్ట్రంలోని ఎన్నో దిన, వారపత్రికలలో వీరి రచనలు ప్రచురింపబడ్డాయి.

